సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 7 । నవంబర్ । 2023

నామినేషన్ల వివరాలు.. 3వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
సిరిసిల్ల	3	4
వేములవాడ	00	00

NOMINATIONS!

భక్తజన జాతర

వేములవాడ: రాజన్న దర్శనానికి సోమవారం భక్తులు జాతరలా తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయ ఆవరణ రద్దీగా మారింది. ధర్మగుండంలోస్నానాలు చేసిన భక్తులు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అనుబంధ ఆలయాలను సందర్శించారు.



సిరిశాల 'స్వర'శంఖాలు

- పార్టీలకు వ్యాఖ్యాతలుగా జిల్లావాసులు
- ఎన్నికల నేపథ్యంలో ప్రచారబాణీలు

స్వరాలు.. అభ్యర్థులకు వరాలు



సిరిసిల్లటౌన్: ఎన్నికలు ఏవైనా ప్రచారం తప్పనిసరి. ఎక్కడ ప్రచారం చేసిన సిరిసిల్ల గొంతులు వినిపించడం రివాజు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రచార మాధ్యమాలు మారుతున్నా.. తమ అభ్యర్థిని గెలిపించాలని వినిపించే గొంతులు మాత్రం సిరిసిల్ల బిడ్డలవే. ఓటర్లను ప్రసన్నం చేసుకునేలా వినిపించే మృదుమధుర గొంతులు ఇక్కడి వారివే కావడం విశేషం. సిరిసిల్లకు చెందిన ఎండీ సలీం, సాంబారి రాజు వ్యాఖ్యాతలుగా రాణిస్తున్న వైనంపై ప్రత్యేక కథనం..

ఐదు దశాబ్దాలుగా స్వరప్రస్థానం



ప్రభుత్వ గుర్తింపు కావాలి

యాభై ఏళ్లుగా ఎన్నికలు, వ్యాపార, వాణిజ్య, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో నా గొంతు వినిపిస్తుంది. ఎంతో మంది అభిమానాన్ని కూడ గట్టుకోవడంతోపాటు ఆర్థికంగా నిలదొక్కుకున్నాను. ప్రభుత్వ గుర్తింపు లేకపోవడం వెలితిగా ఉంది. రాజు, స్వాతి, శారద, రాజు, సురేశ్ ఇలా నాకు ఇష్టమైన శిష్యులు. వారు కూడా ఇదే రంగంలో రాణిస్తుండటం సంతోషంగా ఉంది.
– ఎండీ సలీం

సిరిసిల్లకు చెందిన సలీం స్వర ప్రస్థానం 1974లో ప్రారంభమైంది. పదోతరగతి చదివే రోజుల్లో స్థానికంగా శ్రీలక్ష్మీ థియేటర్ ప్రారంభమైంది. రిక్షాల్లో పాటలు వేస్తూ మధ్యమధ్యలో.. 'రోజా నాలుగు ఆటలు. నేడే చూడండి..' అంటూ వ్యాఖ్యాతగా ఆరంగేట్రం చేశారు. 1980లో భాగ్యలక్ష్మి లాటరీ టిక్కెట్ల విక్రయానికి, బెల్లంపల్లి పంచాయతీ ఎన్నికల కోసం తన స్వరంఅరువిచ్చారు. ఇందిరాగాంధీ నుంచి కేసీఆర్, ఎమ్మెస్సార్, కేటీఆర్, భాగ్యరెడ్డి, నర్సింగారావు, గొట్టె భూపతితోపాటు ఇప్పటి వార్డుకౌన్సిలర్ల వరకు సలీం స్వరం ప్రచారాస్త్రంగా మారింది. స్పష్టమైన తెలుగు ఉచ్చరణతో ప్రచారానికి నవ్యత్వాన్ని ఆపాదిస్తూ.. తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీభాషలు మాట్లాడుతారు.

అమీన్ జే.సాయిని స్ఫూర్తితో..

1975 తర్వాత రేడియోలో సిలోన్ బ్యాండ్‌లో విని పించే ప్రఖ్యాత వ్యాఖ్యాత అమీన్ జే.సాయిని స్ఫూర్తితో వ్యాఖ్యాతగా రాణించారు. 1988లో ఆకా శవాణిలో 25 నిమిషాల ప్రత్యక్ష వ్యాఖ్యానంతో అలరించారు. ఘంటసాల ఆలపించిన పాటలకు 1989లో తన గొంతుతో వ్యాఖ్యానాన్ని ఇచ్చారు. చాలా ఏళ్లు న్యూస్‌చానల్స్‌లో న్యూస్‌రీడర్‌గా రా ణించారు. 1999లో దూరదర్శన్ న్యూస్‌రీడర్ శాంతిస్వరూప్ చేతులమీదుగా సత్కారం పొందారు. 2009, 2011లో ముంబైలో జరిగిన ఆంధ్ర మహాసభల్లో మూడుసార్లు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. 2014లో మానేరు రచయితల సంఘం వ్యాఖ్యాన చతురానన బిరుదు, 2005లో సిరివెలుగుల అవా ర్డు పొందారు. గ్రామీణ కళాజ్యోతి, మిద్దె రాములు, నాగుల మల్లయ్య స్మారక పురస్కారాలు అందుకున్నారు. సలీంకు ఎందరో ఏకలవ్య శిష్యులున్నారు.

స్వర 'రాజ'సం



అంతటా తెలుగువాణి వినపడాలి

ఇరవై ఏళ్లుగా గురువు సలీం స్ఫూర్తితో వ్యాఖ్యానంలో గుర్తింపు సాధించాను. తెలుగు రాష్ట్రాల్లోని ప్రాంతీయ యాసల్లో వారు కోరిన విధంగా వ్యాఖ్యానం చేస్తున్నాను. నాతోపాటుగా ఫీమేయిల్ వాయిస్‌కు స్థానిక మహిళ వ్యాఖ్యాత స్వాతి అందిస్తుంది. దేశంలో ఎక్కడపోయినా తెలుగువాణి వినిపించాలి. ఇతర భాషల్లో ప్రకటనలు కూడా చేస్తున్నాం.
– సాంబారి రాజు, సిరిసిల్ల

సలీం స్ఫూర్తిగా సిరిసిల్ల కేంద్రంగా రాణిస్తున్న మరో స్వర రాజం సాంబారి రాజు. 1982 జూన్ 16న సిరిసిల్లలోని నిరుపేద చేనేత కుటుంబంలో జన్మించాడు. తల్లిదండ్రులు వెంకటేశం, బాలలక్ష్మి. ఆర్థిక పరిస్థితులు అంతంతే కావడంతో ఆరోతరగతి వరకు చదువుకున్న రాజు బాబాయ్ సాంబారి ప్రదీప్ నడిపే ఆర్కెస్ట్రాలో ప్రవేశించాడు. మొదటి నుంచి సౌండ్‌సిస్టమ్, వ్యాఖ్యాన స్వరంతో ప్రయోగాలు చేసి క్రమంగా గుర్తింపు పొందాడు. పదిహేనేళ్ల క్రితం డబ్బింగ్ కళాకారుడిగా అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం వ్యాపార ప్రకటనలతోపాటు ఎన్నికల ప్రచారానికి తన స్వరాన్ని అరువు ఇస్తున్నాడు. ఇరువై ఏళ్లుగా 20వేలకు పైగా వ్యాపార, ఎన్నికల ప్రకటనలకు తన స్వరాన్ని అరువిచ్చారు. అందివచ్చిన సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ ప్రస్తుతం ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నారు. సమాచారం పంపితే చాలు వాయిస్ ఓవర్ సిద్ధం చేసి, మెయిల్ చేసేస్తున్నారు. మరో పది మందికి ఉపాధినిస్తున్నారు. 2002లో సిరిసిల్లకు చెందిన విశ్వభారతి పాఠశాల ప్రకటనతో గుర్తింపు వచ్చింది. కేసీఆర్, కేటీఆర్, ఈటల రాజేందర్, సుంకె రవిశంకర్, గంప గోవర్ధన్, షబ్బీర్ అలీ ఎన్నికల్లో నిల్చోగా వారికి ఓట్లు వేయాలంటూ.. ప్రకటనలతో ఆకట్టుకున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌టీపీ, జనసేన, టీడీపీలకు ప్రచార వ్యాఖ్యాతగా రాణిస్తూ గురువు సలీం బాటలోనే జాతీయస్థాయిలో గుర్తింపు పొందుతున్నారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రతిపాదనలు సమర్పించాలి


కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు, 80 ఏళ్లకు పైబడిన వృద్ధ ఓటర్లకు, అత్యవసర సర్వీస్‌ల్లో ఉన్న వారికి, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో 13 రకాల అత్యవసర సేవల రంగాలకు చెందిన సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఇప్పటికే ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది, అత్యవసర సర్వీస్‌లకు చెందిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకోనేందుకు వీలుగా ఫారం–12(ఈ)లు అందించారని వివరించారు. దివ్యాంగులు, వృద్ధులకు తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్‌తో ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించామని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 24, 25, 26 తేదీలలో దివ్యాంగులకు, వృద్ధ ఓటర్ల ఇంటి వద్దకే వెళ్లి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. దీని కోసం 7వ తేదీలోగా ప్రతిపాదనలు అందించాలని కోరారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ రిటర్నింగ్ అధికారులు ఆనంద్‌కుమార్, మధుసూదన్, భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ గంగయ్య, నోడల్ అధికారులు లక్ష్మీరాజం, రవీందర్, శ్రీనివాస్, ఎండీ రఫీ, ఎం.దశరథం పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలు పెంచుకోవాలి

జీవన నైపుణ్యాలు పెంచుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ సిబ్బందితో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కేజీబీవీలలో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న గ్రామీణ ప్రాంత కిశోర బాలికలకు జీవన నైపుణ్యాలు పెంచేందుకు టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లోని విద్యార్థులను రెండు గ్రేడులుగా విభజిస్తూ అందులో విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ వంటి అంశాలను ప్రాక్టికల్‌గా నేర్పిస్తారని తెలిపారు. ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలా ఉండాలి, నిర్ణయం తీసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు ఎలా ఉండాలి, నాయకత్వం నైపుణ్యాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా కావాలంటే ఎలాంటి నైపుణ్యాలు ఉండాలి అనే అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ఆంగ్లభాష నైపుణ్యాలు చాలా అవసరమన్నారు. జిల్లాలోని కేజీబీవీ విద్యాలయాలలో తమ వారం రోజుల అధ్యయన ఫలితాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. టాటా సంస్థ ఫ్యాకల్టీ, ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జోసఫ్ అంతోని, ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ గ్రేస్ వర్షిత, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం, జెండర్ ఈక్విటీ కో–ఆర్డినేటర్ పద్మజ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- ఎస్పీ అఖిల్ మహాజన్


పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ

వేములవాడఅర్బన్: వేములవాడ రూరల్ మండలం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వట్టెంల, ఫాజుల్‌నగర్, నూకలమర్రి, ఎదురుగట్ల, మర్రిపల్లి, లింగంపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం తనిఖీ చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అత్యవసరం ఉన్న పోలింగ్ స్టేషన్ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సమస్యాత్మక గ్రామాలను విధిగా పర్యటించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహించి ప్రజలకు భద్రతపై భరోసా ఇవ్వాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. డీఎస్పీ నాగేంద్రచారి, వేములవాడరూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్సై మారుతి ఉన్నారు.

న్యూస్‌రీల్

రాజన్న సేవలో ఎన్నికల వ్యయ పరిశీలకులు


ఎన్నికల వ్యయపరిశీలకులు శివశంకర్‌ను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

వేములవాడ: రాజన్నను కరీంనగర్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు శివశంకర్(ఐఆర్ఎస్) సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించి, ప్రసాదాలు అందజేశారు. ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, వేములవాడ అర్బన్ తహసీల్దార్ మహేశ్, ఆర్ఐ సతీశ్ తదితరులు ఉన్నారు.

సిరిసిల్లలో రెండు నామినేషన్లు

- వేములవాడలో బోణీ కాలేదు


సిరిసిల్లలో నామినేషన్ వేస్తున్న గౌటే గణేశ్

సిరిసిల్ల: జిల్లాలో సోమవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. సిరిసిల్ల నియోజకవర్గంలో ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ) అభ్యర్థిగా కేసుగాని పరమేశ్వరి రిటర్నింగ్ అధికారి ఎన్.ఆనంద్ కుమార్‌కు నామినేషన్ సమర్పించారు. శివసేన(ఉద్ధవ్ బాల్‌ఠాక్రే) పార్టీ అభ్యర్థిగా గౌటే గణేశ్ రెండు సెట్ల నామినేషన్ల దాఖలు చేశారు. సిరిసిల్లలో శనివారం ఇండిపెండెంట్‌గా లగిశెట్టి శ్రీనివాస్ నామినేషన్ వేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఇప్పటి వరకు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వేములవాడ నియోజకవర్గంలో సోమవారం కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. వేములవాడ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆఫీస్ వద్ద పోలీసు భద్రత కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. సామన్యులు ఎవరూ అటువైపు వెళ్లకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. నామినేషన్ దాఖలు చేసేందుకు శుక్రవారం వరకు గడువు ఉంది. జిల్లాలో ఎన్నికల ప్రచారం మాత్రం క్షేత్రస్థాయిలో ఊపందుకుంది.

గోశాలకు రాజన్న కోడెలు


కోడెలను అందిస్తున్న ఆలయ అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను మహబూబాబాద్ జిల్లా నరసింహులపేట మండలం పెద్దనాగారం గ్రామానికి చెందిన శివపార్వతీ గోశాలకు 30, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రామవారం గ్రామానికి చెందిన మహానంది గోశాలకు 30 కోడెలను అందజేశారు. ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యామ్, శంకర్ తదితరులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు శిక్షణ


మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సోమవారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టిన తొలిమెట్టు కమ్యూనిటీ మూవ్‌మెంట్‌లో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు 'తామంతా పిల్లల కోసం' అనే నినాదంతో అవగాహన కల్పించారు. వాలంటీర్లు ప్రతి శనివారం తమకు నచ్చిన లేదా చదువుకున్న బడికి వెళ్లి బోధన చేయాల్సి ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధర్మపురి తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, అధ్యాపకులు వాణి, భిక్షమయ్య, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మీకు తెలుసా?

ఐదుసార్లు.. 'వెలిచాల'



కరీంనగర్: కరీంనగర్ అసెంబ్లీ స్థానం నుంచి 1989లో ఇండిపెండెంట్‌గా విజయం సాధించిన వెలిచాల జగపతిరావు 1972లో జగిత్యాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు. ఆయన 1985లో కాంగ్రెస్ అభ్యర్థిగా 1989లో ఇండిపెండెంట్‌గా, 1994లో మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా తిరిగి 1999లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయడం విశేషం.

మూడో జాబితాలో ఇద్దరికి..

- కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు
- కరీంనగర్‌కు 'పురమల్ల'..
- సిరిసిల్లకు కేకే మహేందర్‌రెడ్డి



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాను ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం రాత్రి విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ అభ్యర్థిగా పురుమల్ల శ్రీనివాస్, సిరిసిల్ల అసెంబ్లీ నియోజక వర్గ అభ్యర్థిగా కేకే మహేందర్‌రెడ్డిని నియమించారు. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజక వర్గాలకు ఇదివరకే 11 నియోజక వర్గాలకు అభ్యర్థులను ప్రకటించగా వారి నియోజక వర్గాల్లో ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. కరీంనగర్, సిరిసిల్ల అసెంబ్లీ సీట్ల అభ్యర్థుల ఎంపిక విషయంపై ఏఐసీసీ స్థాయిలో సంప్రదింపులు జరిపి టికెట్లను ఖరారు చేసినట్లు సమాచారం. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికైన పురమల్ల శ్రీనివాస్ బొమ్మకల్ సర్పంచ్‌గా.. ఆయన సతీమణి పురమల్ల లలిత కరీంనగర్‌రూరల్ జెడ్పీటీసీగా కొనసాగుతున్నారు. ఇటీవలనే బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరి టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసి ఎట్టకేలకు కాంగ్రెస్ టికెట్ కైవసం చేసుకున్నారు. సిరిసిల్ల నియోజక వర్గానికి సంబంధించి గతంలో పలుమార్లు పోటీచేసి ఓటమి చెందిన కేకే మహేందర్‌రెడ్డిని ఎంపిక చేస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది.

అభ్యర్థుల బయోడేటా

కరీంనగర్ నియోజక వర్గం



పురమల్ల శ్రీనివాస్
పుట్టిన తేదీ: 10,10,1973
సామాజిక వర్గం: మున్నూరు కాపు
స్వగ్రామం: బొమ్మకల్, కరీంనగర్‌రూరల్
అనుభవం :
- 2001 నుంచి 2006 వరకు ఉప సర్పంచ్
- 2006 నుంచి 2011 వరకు సర్పంచ్
- 2014లో జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప ఓట్లతో ఓటమి
- 2019లో బొమ్మకల్ గ్రామ సర్పంచ్‌గా ఎన్నిక
- 1992 నుంచి 2018 వరకు కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాలో పనిచేశారు.
- గత ఎన్నికల్లో సర్పంచ్‌గా,, ఆయన సతీమణి పురమల్ల లలిత జెడ్పీటీసీగా ఎన్నికై పనిచేస్తున్నారు.

సిరిసిల్ల నియోజక వర్గం



కేకే మహేందర్‌రెడ్డి
విద్యార్హతలు : ఎంఏ, ఎల్ఎల్‌బీ, హైకోర్టు న్యాయవాది
సామాజిక వర్గం : రెడ్డి
స్వగ్రామం: నామాపూర్, ముస్తాబాద్, రాజన్నసిరిసిల్ల
అనుభవం:
- బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు
- 2004లో సిరిసిల్ల నియోజక వర్గం నుంచి బీఆర్ఎస్ టికెట్ ఆశించి భంగపడి స్వతంత్ర అభ్యర్థిగా స్వల్ప ఓట్లతో ఓటమి.
- 2009, 2014, 2018లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిల

ఆలోచించి ఓటు వేయాలి

- మీ తలరాతలు మార్చే ఎన్నికలు
- సెంటిమెంట్లకు పడిపోవద్దు
- కులం కూడు పెట్టదు..
- వేములవాడను దత్తత తీసుకుంటా
- మంత్రి కేటీఆర్


బీఆర్ఎస్ ఆఫీస్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: బాగా ఆలోచించి ఓటు వేయాలి.. మీ తలరాతలు మార్చే ఎన్నికలు ఇవీ.. కులం కూడు పెట్టదు.. సెంటిమెంట్లకు.. ఆయింట్‌మెంట్లకు పడిపోవద్దని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు కోరారు. వేములవాడ నియోజకవర్గాన్ని నేను దత్తత తీసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. వేములవాడలో సోమవారం యువఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి వ్యాపారంలో స్థిరపడ్డాడని, ఈ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాడన్నారు. నాతో కలిపి వేములవాడకు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉంటారని.. సిరిసిల్లతో సమానంగా వేములవాడను అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఓటు వేస్తే.. అది ఢిల్లీకి చేరుతుందన్నారు. అదే బీఆర్ఎస్ అభ్యర్థికి వేస్తే.. తెలంగాణ సాధించిన కేసీఆర్‌కు చేరుతుందన్నా రు. ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉందని, దాన్ని కుక్కలు చింపిన విస్తరి చేయొద్దని కోరారు. వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ వేములవాడను వెన్నెలవాడగా మారుస్తానన్నారు. ప ర్యాటకంగా అభివృద్ధి చేసి మధ్యమానేరు నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు పెంచుతానని పే ర్కొన్నారు. ఎన్ఆర్ఐ తోట రామ్‌కుమార్, రాజు తదితరులు మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, దరువు ఎల్లన్న, మాందాల భాస్కర్, యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో..

జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాముతోపాటు పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ నాయకులు తోట ఆగయ్య, చీటి నర్సింగరావు, కల్వకుంట్ల గోపాల్‌రావు, బొల్లి రామ్మోహన్, అక్కరాజు శ్రీనివాస్, ఆవునూరి రమాకాంత్‌రావు, పూర్మాని లింగారెడ్డి, ఎంపీపీ పడిగెల మానస, ఏఎంసీ చైర్మన్ పూసపల్లి సరస్వతి పాల్గొన్నారు.

దేశంలోనే సిరిసిల్లను నంబర్ వన్ చేశా..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజకీయంగా జన్మనిచ్చిన సిరిసిల్లను దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దానని.. నా గెలుపుపై ఆగం లేదని.. సిరిసిల్ల ప్రజలే బలం.. బలగమని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో సోమవారం నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సిరిసిల్లలో తనను ఓడించడానికి వివిధ పార్టీలు పారాచూట్ నాయకులను దింపుతున్నాయని.. యువకార్యకర్తలు సోషల్‌మీడియాలో చురుకుగా పనిచేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, మండలాధ్యక్షుడు కృష్ణహరి, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ కొండపురం బాల్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు ఎడ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి రూ.లక్ష విరాళం

మంత్రి కేటీఆర్‌కు ఎన్నికల ఖర్చు కోసం రాజన్నపేటకు చెందిన నమిలికొండ శంకర్ రూ.లక్ష చెక్కును విరాళంగా అందించారు. ముస్తాబాద్‌కు చెందిన కేటీఆర్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ కుమారుడు మెంగని తారక్‌రామ్ తన కిడ్డీబ్యాంక్‌లో దాచుకున్న డబ్బులను కేటీఆర్‌కు అందించారు. మనోహర్ ఖడ్గం, అక్కపల్లికి చెందిన నవీన్ కారుగుర్తును, చెక్కపల్లి మహేశ్ బాణం గుర్తులను కేటీఆర్‌కు అందించారు.

జిల్లా సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు



గంభీరావుపేట(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల సరిహద్దు గంభీరావుపేట మండలం పెద్దమ్మ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేత, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి కారును పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలకు గోవర్ధన్‌రెడ్డి సహకరించారు.

క్లుప్తంగా

నాల్గోరోజు ఒకే నామినేషన్



కోరుట్లలో నామినేషన్ వేస్తున్న ఆరె రాజేందర్

జగిత్యాల: నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై నాలుగు రోజులవుతోంది. ఇప్పటివరకు ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తప్ప ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. కోరుట్ల నుంచి ఆరె రాజేందర్ స్వతంత్ర అభ్యర్థిగా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు.

జిల్లాస్థాయి ఎంపిక పోటీలు


బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో విద్యార్థులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో సోమవారం జిల్లాస్థాయి పాఠశాలల అండర్–14, 17 బాలబాలికల బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీరాంనాయక్ తెలిపారు. ఈ పోటీల్లో 450మంది విద్యార్థులు పోటీ పడ్డారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల నిర్వహణలో పెటా జిల్లా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, పీఈటీలు పడాల క్రిష్ణప్రసాద్, నిరంజన్, అశోక్, వెంకటలక్ష్మి, మల్లేశ్వరి, విజయ, దయాకర్, పెసరి తిరుమలేష్ పాల్గొన్నారు.

పుస్తెల తాడు చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్‌టీం

వెల్గటూర్: మండల కేంద్రానికి చెందిన గరిమెళ్ల సౌజన్య సోమవారం ఉదయం ఇంట్లో పూజ చేస్తుండగా.. గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి బాధితురాలి కంట్లో మట్టి కొట్టి మెడలోంచి రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు లాక్కొని పారిపోయినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. దాని విలువ సుమారు రూ.1.50 లక్షలుంటుందని బాధితురాలు చెప్పారు. పోలీసులు, క్లూస్‌టీం ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితురాలి భర్త స్థానికంగా పూజాస్టోర్ నిర్వహిస్తారు. ఆయన బయటికెళ్లడంతో చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

గంజాయి పట్టివేత

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ బస్టాండ్‌లో ఓ వ్యక్తి వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన నీల్‌కంట్ పడాల్(24) తన బ్యాగులో 4 కిలోల గంజాయితో వేములవాడ బస్టాండ్‌లో పట్టుబడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎన్నికలప్పుడే గుర్తొచ్చే కొత్తపేట

- పంచాయతీ ఏర్పాటై ఐదేళ్లైనా అభివృద్ధికి దూరమే..
- 35 ఏళ్లు గడిచినా బస్సు ఎరగని గ్రామం
- రోడ్డు నిర్మాణంపై హామీలు తప్పా.. ఆచరణ శూన్యం
- ఆందోళన చేసిన గ్రామస్తులపై కేసులు పెట్టిన వైనం


కొత్తపేట శివారులోని ఒర్రెతో రాకపోకలకు ఇబ్బందులు


తాత్కాలిక పైపులైన్లు వరద నీటికి కోత

చందుర్తి(వేములవాడ): 35 సంవత్సరాల క్రితం వలస వచ్చిన ప్రజలతో కొత్తపేట గ్రామం ఏర్పడింది. ఇక్కడ 150కి పైగా కుటుంబాలు నివాసముటున్నాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు గ్రామానికి సరైన దారి లేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలప్పుడు మాత్రం గ్రామాలకు వచ్చే నాయకులు ఎన్నికల్లో గెలిస్తే రోడ్డు వేస్తాం, సకల సౌకర్యాలు కల్పిస్తామంటూ గ్రామస్తుల ఎదుట ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ మభ్యపెడుతూ ఓట్లు వేయించుకుంటున్నారు. 35 ఏళ్ల క్రితం ఏర్పడిన ఈ పల్లెకు గ్రామస్తులు కొత్తపేటగా నామకరణం చేసుకున్నారు. అప్పటి పాలకులు ఈ పల్లెను అప్పుడు మల్యాల పంచాయతీలో విలీనం చేశారు. తిరిగి 2001లో కట్టలింగంపేట పంచాయతీ ఏర్పాటు కావడంతో అప్పుడు మళ్లీ ఆమ్లేట్‌గా గ్రామం కొత్తపేటను చేర్చారు. తిరిగి 2018లో నూతన పంచాయతీగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఐదేళ్లుగా అభివృద్ధికి ఈ పల్లె ఆమడ దూరంలోనే ఉంది. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు వేములవాడ–కోరుట్ల ప్రధాన రహదారైనా రుద్రంగి గ్రామ శివారులో ఐదు మాసాల క్రితం ఆందోళన చేపడితే పోలీసులు వారిపై కేసులు పెట్టారు. రోడ్డు మార్గం లేక కాలినడకనే రాకపోకలు సాగిస్తున్నారు.

వాన పడితే అంతే..

ఈ ఊరు ప్రధాన రహదారి నుంచి సుమారు 4 కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఉంది. తేలికపాటి వర్షం కురిసినా.. అటవీ ప్రాంతంలోని గుట్టల నుంచి వచ్చే వరద నీరు రెండు ఒర్రెలతో ఉధృతిగా ప్రవహిస్తాయి. దీంతో వారం రోజుల పాటు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. అలాంటి సమయంలో వారికి ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే పసరే దిక్కు. చేతి వైద్యం నమ్ముకొని కాలాన్ని వెళ్లదీసే కాలంలోనే ఉన్నారు.

నిర్వహణ మరిచారు..

పంచాయతీలో ఇద్దరు కార్మికులున్నా.. పనులు చేయించడంలో పంచాయతీ పాలక వర్గంతో పాటు పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారని చెప్పడంలో సందేహం లేదు. గ్రామంలో నిర్మించిన కంపోస్టు షెడ్‌ను ఏ ఒక్కరోజు వినియోగించన దాఖలాల్లేవని చెప్పడానికి అందులో పడుకునేందుకు వేసిన మంచం, అందులో పెట్టిన రెండు ద్విచక్ర వాహనాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. పల్లె ప్రకృతి వనం కలుపు మొక్కలతో నిండిపోయి ఆనవాళ్లు కోల్పోయింది. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన వైకుంఠధామంలో బోరు వేసి మోటారు బిగించడాన్ని మరిచిపోయారు. మండల అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

ప్రధాన సమస్యలు

- రుద్రంగి ప్రధాన రహదారి నుంచి కొత్తపేటకు రోడ్డు నిర్మాణం.
- రెండు ప్రధాన ఒర్రెల వద్ద వంతెనల నిర్మాణాలు చేపట్టాలి.
- గ్రామంలోని వీధుల్లో మురుగు కాలువల్లేక మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది.
- పంచాయతీ నిధులు మంజూరై 4మాసాలైనా పనులు ప్రారంభించకపోవడంతో అద్దె భవనంలో ఇబ్బందులు పడుతున్నారు.
- మంచినీటి ట్యాంకున్నా.. పూర్తిస్థాయిలో పనులు చేపట్టక నిరుపయోగంగానే ఉంది.
- మిషన్ భగీరథ సంపును నిర్మించి గ్రామానికి డైరెక్ట్‌గా మంచినీటిని పంపింగ్ చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే మంచినీటికి తిప్పలు తప్పవు.
- వాటర్ ట్యాంకు పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి.
- బస్సు సౌకర్యం కల్పించాలి.
- 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కట్టలింగంపేట గ్రామం నుంచి రేషన్ సరుకులు తెచ్చుకుంటున్నారు. గ్రామంలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలి.
- చందుర్తి మండల కేంద్రానికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామాన్ని 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న రుద్రంగి మండల కేంద్రంలో విలీనం చేయాలి.

ఆందోళన చేస్తే కేసు పెట్టింద్రు



బతుకుదెరువు కోసం మా తండ్రి గ్రామానికి వలస వచ్చిండు. 35 ఏళ్లుగా గ్రామానికి రోడ్డు నిర్మించలేదు. గతంలో ఇతర గ్రామాలకు వెళ్లాలంటే కాలినడక, సైకిల్, ఎడ్ల బండ్లపై పోయేటోళ్లు. ఇపుడు పైసలున్నోళ్లు మోటారు సైకిల్ కొనుకున్నరు. పైసలు లేనోళ్లకు ఇప్పటికి కాలినడకనే దిక్కు. ధర్నా చేస్తే పోలీసులు కేసు పెట్టింద్రు.

– ఊరడి వెంకన్న, గొర్రెల కాపరి, కొత్తపేట

మాట వింటలేరు



ఇక్కడికి వచ్చిన కొత్తలో ఒక్కరు చెబితే అందరూ వినేటోళ్లు. అప్పుడు అందరం ఐక్యంగా ఉండి ఏ సమస్య వచ్చినా పరిష్కారం చేసుకునేటోళ్లం. ప్రభుత్వం డబ్బులు ఇవ్వకున్నా సొంత పైసలతో బడిని కట్టుకున్నాం. గిప్పుడేమో ఇంటికో పెద్ద మనిషి అయిండు. రోడ్డు కోసం ధర్నాకు పోతే ఒకరికొకరికి పడక కేసుల పాలైంద్రు.

– పిట్టల నారాయణ, మాజీ ఉప సర్పంచ్, కొత్తపేట

పనులు జరుగుతున్నయ్



ప్రభుత్వం గ్రామానికి అనేక నిధులను కేటాయించింది. క్రీడా మైదానం, కంపోస్టు షెడ్, వైకుంఠధామం నిర్మాణం పూర్తి చేసుకున్నాం. పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులను త్వరలోనే చేపడతాం. పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేసుకుంటున్నాం. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైతే ప్రధాన సమస్య తీరుతుంది.

– ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి, కొత్తపేట

కళ్లు తెరవకముందే నూరేళ్లు

- ముళ్లపొదల్లో శిశువు మృతదేహం
- పీక్కుతిన్న పందులు
- వేములవాడలో అమానుషం

వేములవాడ: కన్నపేగు బంధం భారమనుకుంది కాబోలు.. కళ్లు కూడా తెరవని శిశువును ముళ్లపొదల్లో పడేసింది. తల్లి పొత్తిళ్లలో భద్రంగా ఉండాల్సిన శిశువు ముళ్లపొదల మధ్య జీవచ్ఛవంలా పడి ఉండడాన్ని చూసిన వారి హృదయాలు ద్రవించాయి. పందులు సగం వరకు కొరికి వేసిన శిశువు మృతదేహం స్థానికులు గమనించడంతో ఈ అమానుష సంఘటన వెలుగుచూసింది. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలోని న్యూఅర్బన్‌కాలనీలో సోమవారం సాయంత్రం చిన్నపిల్లలు ఆడుకుంటుండగా అప్పుడే పుట్టిన పసికందు మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలపడంతో వారు శిశువు మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. సమీప పరిసరాల్లోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కో–ఆప్షన్‌కు శ్రీలక్ష్మి రాజీనామా

- కాంగ్రెస్‌లో చేరిక

వేములవాడ: వేములవాడ మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యత్వానికి పుల్కం శ్రీలక్ష్మి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. బీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి సైతం రాజీనామా చేసినట్లు చెప్పారు. అంతేకాకుండా శ్రీలక్ష్మి భర్త పుల్కం రాజు బీఆర్‌ఎస్ వేములవాడ పట్టణశాఖ అధ్యక్షుడిగా రాజీనామా చేశారు. కౌన్సిలర్ బింగి మహేశ్ సైతం బీఆర్‌ఎస్‌ను వీడారు.

ప్రలోభాలకు లొంగొద్దు

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాకేశ్

ముస్తాబాద్(సిరిసిల్ల): భవిష్యత్ కోసం ఈ రోజు ఓట్లు అమ్ముకోవద్దని.. ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగొద్దని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్ కోరారు. ముస్తాబాద్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పక్షాలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా కార్యక్రమాలను చేపడుతున్నాయన్నారు. ఓటు ప్రజాస్వామ్య దేశంలో సామాన్యుల పాలిట వజ్రాయుధమన్నారు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ఆలోచించి మంచి నాయకులను ఎన్నుకోవాలని కోరారు.

అనుమతి లేకుంటే మైకులు బంద్..!

- ప్రచారానికి ఎన్నికల సంఘం నిబంధనలు
- ప్రభుత్వ మైదానాలు, ఆస్తులు వాడొద్దు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



గొల్లపల్లి: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తస్మాత్ జాగ్రత్త. నిబంధనల మేరకే ప్రచారం నిర్వహించాలి. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నికల సంఘం స్పష్టం చేసింది. దీని ప్రకారం నాయకులు, కార్యకర్తలు ఉదయం 6 గంటల తర్వాతే ప్రచారం ప్రారంభించాలి. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత బహిరంగ సభలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు చీరలు, చొక్కాలు, ఇతర దుస్తులు, క్రీడా పరికరాలు తదితర వస్తువులు పంపిణీ చేస్తే ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినట్లు భావిస్తారు. టోపీలు, కండువాలు మాత్రం ఇవ్వొచ్చు. కానీ వాటి ఖర్చును అభ్యర్థి ఎన్నికల పద్దులో రాయాల్సి ఉంటుంది. ప్రచారం చేసే అభ్యర్థి ఎన్ని వాహనాలనైనా ఉపయోగించుకునే వీలుంది. కానీ ముందస్తు రిటర్నింగ్ అధికారి అనుమతి పొందాలి. అనుమతి పత్రం స్పష్టంగా కనిపించేలా వాహనానికి అంటించాలి. పర్మిట్ మీద వాహనం నెంబర్, అభ్యర్థి వివరాలుండాలి. ఓ అభ్యర్థి పేరిట పొందిన పత్రాన్ని మరో అభ్యర్థి ప్రచారానికి వినియోగిస్తే చర్యలు తీసుకుంటారు. కరపత్రాలు ముద్రించే అభ్యర్థులు తప్పనిసరిగా ప్రింటింగ్ ప్రెస్ చిరునామా ప్రచురించాలి.

బహిరంగ సభల సందర్భంగా..

బహిరంగ సభ ఏర్పాటు చేసే ప్రదేశం, తేదీ, సమయం ముందుగా పోలీస్ అధికారులకు తెలిపి రాతపూర్వకంగా అనుమతి తీసుకోవాలి. పోలీసులే ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ ఏర్పాట్లు పరిశీలించే అవకాశముంటుంది. సభ ఏర్పాటు చేసే ప్రదేశం.. ప్రభుత్వ ఆస్తులు, దేవాలయాలకు సంబంధించి ఉండొద్దు. ప్రైవేట్ ఆస్తులైతే సంబంధిత స్థలం యజమాని నుంచి లిఖితపూర్వకంగా అనుమతి తీసుకోవాలి. సభ ఏర్పాటు చేసే స్థలం శాంతిభద్రతల దృష్ట్యా అభ్యంతరకరం కాదని నిర్ధారించుకోవాలి. సభకు మైక్ వినియోగానికి పోలీస్ శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలి. సభను అడ్డుకోవడం, గొడవ సృష్టించడం వంటి ముప్పు కలిగించే శక్తులు ఎవరైనా ఉంటే పోలీసులకు సమాచారమందించి వారి సాయం తీసుకోవాలి.

ఊరేగింపుల్లో..

ప్రతి అభ్యర్థి ఊరేగింపు ఆరంభమయ్యే సమయం, సాగే దారి, ప్రత్యేక సమావేశాలు, ముగింపు సమయం ముందుగానే పోలీసులకు సమాచారమివ్వాలి. ఊరేగింపు సాగే మార్గం, సమావేశాలు నిర్వహించే ప్రదేశాల్లో ఎలాంటి ఆంక్షలు లేవని పోలీసు అధికారుల నుంచి నిర్ధారించుకోవాలి. అభ్యంతరాలుంటే మార్గం మార్చుకోవాలి. ఊరేగింపుల్లో అందరు పోలీసులు సూచించిన విధంగా రోడ్డుకు ఒకపక్కన సాగుతూ క్రమశిక్షణతో మెలగాలి. వేర్వేరు పార్టీలు ఒకే మార్గం, ఒకే సమయంలో ఊరేగింపులు తీయడానికి పోలీసులు అనుమతించరు. ఒకరికొకరు ఎదురుపడకుండా చూసుకోవడం ఉత్తమం. ఊరేగింపుల్లో పాల్గొనేవారు ఏవిధమైన మారణాయుధాలు, విపరీత శబ్దాలు కలిగించే పేలుడు పదార్థాలు వెంట తీసుకురాకుండా అభ్యర్థులు, వారి అనుచరులే చూసుకోవాలి. ఊరేగింపులు, సభలు, సమావేశాల్లో ప్రతిపక్షాలపై దూషణలు, వ్యక్తిగత విమర్శలు చేయకుండా జాగ్రత్తలు పాటించాలి.

ఆన్‌లైన్ లోన్ పేరిట మోసం

- ఉద్యోగాల పేరిట రూ.20 లక్షలు టోకరా



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, పట్టుబడిన నగదు, సెల్‌ఫోన్లు, ఏటీఎం కార్డులు, చెక్ బుక్

సిరిసిల్లక్రైం: గంభీరావుపేటకు చెందిన మహిళకు బ్యాంకు రుణం ఇప్పిస్తామని మోసం చేసిన సైబర్ నేరగాళ్లను సిరిసిల్ల పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ మీడియాతో మాట్లాడారు. జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు ఆన్‌లైన్ ఆప్ లోన్‌లో ఉన్న ఫోన్ నెంబర్లు సాధించి తద్వారా పలువురికి ప్రభుత్వ బ్యాంకుల నుంచి లోన్ ఇప్పిస్తామని నమ్మబలికి రూ.లక్షలు కొట్టేసినట్లు వివరించారు. నల్గొండ జిల్లా దామడిచెర్ల మండలం కొండూరు జానారెడ్డికాలనీకి చెందిన ధనవాత్ రమేశ్, ధనవాత్ రాజు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. డబ్బు సరిపోక హయాత్‌నగర్‌లోని ఓ ఇల్లు అద్దెకు తీసుకుని డ్రైవర్‌గా పని చేశారు. జస్ట్ డయల్ యాప్‌లో పని కుదుర్చుకున్నారు. పలువురికి లోన్ల పేరిట కాల్ చేసి రుణమిప్పిస్తానని నమ్మబలికారు. సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలానికి చెందిన పద్మావతికి ఏకంగా రూ.26 లక్షలు రుణమిప్పిస్తామని చెప్పి ప్రాసెసింగ్ ఫీజు, ఇన్సూరెన్స్ ఫీజు కింద రూ.3,58,795 మిర్యాలగూడలోని ఓ బ్యాంకు యూపీఐతో ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. అయితే ఆన్‌లైన్ రుణాలిప్పిస్తామన్న కేసుల నమోదున్న రమేశ్, రాజు ఇదే సమయంలో రిమాండ్ వెళ్లారు. తిరిగి జైలు నుంచి రాగానే మళ్లీ పద్మావతికి ఫోన్ చేసి లోన్ రావాలంటే ఇంకో రూ.22వేలు పంపించాలనడంతో అనుమానం వచ్చిన పద్మావతి గంభీరావుపేట పోలీసులకు చెప్పింది. డబ్బులిస్తానని చెప్పడంతో రమేశ్, రాజు గంభీరావుపేట లింగన్నపేట క్రాస్ రోడ్డు వద్దకు రాగానే సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై మహేశ్, సైబర్ క్రైం ఆర్‌ఎస్‌ఐ జునైద్ చాకచక్యంగా పట్టుకున్నారు. వీరి నుంచి కారు, చెక్ పుస్తకాలు, 3 ఏటీఎం కార్డులు, మూడు మొబైళ్లు, రూ.6.50 లక్షల నగదు పట్టుకున్నారు. ఇప్పటికే వారిపై సైబరాబాద్, అల్వాల్, బేగంపేట, గోపాలపురం, మహంకాళి, రాజేంద్రనగర్, కామారెడ్డి, ఖమ్మం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదవ్వగా.. బాధితులుగా 19 మంది ఉన్నారు. ఉద్యోగాల పేరిట దాదాపు రూ.20 లక్షలు మోసం చేసినట్లు ఫిర్యాదులున్నాయని పోలీసులు వెల్లడించారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై మహేశ్, సైబర్ క్రైం ఆర్‌ఎస్‌ఐ జునైద్, సిబ్బంది పాల్గొన్నారు.

90 ప్రాజెక్టులు.. 73వేల మెగావాట్లు

- దేశానికి వెలుగులు విరజిమ్ముతున్న ఎన్టీపీసీ
- నేటితో 48 వసంతాలు పూర్తి
- ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు


రామగుండంలోని ఎన్టీపీసీ

జ్యోతినగర్(రామగుండం): 90 విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు.. 2032 సంవత్సరం నాటికి 1,28,000 మెగావాట్ల నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యంతో దేశానికి వెలుగులు అందిస్తున్న నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ(ఎన్టీపీసీ) మంగళవారంతో 48 వసంతాలు పూర్తిచేసుకుంటోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 73,874 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. కొత్త ప్రాజెక్టులకు అంకురార్పణ చేస్తూ ప్రగతి పథంలో ముందుకు సాగుతోంది. సంస్థలో ప్రస్తుతం 17,794 మంది ఉద్యోగులు(ఎగ్జిక్యూటివ్స్ మాత్రమే..) విధులు నిర్వర్తిస్తున్నారు.

1975న ఎన్టీపీసీగా నామకరణం..

విద్యుత్ కొరతను అధిగమించేందుకు కేంద్రప్రభుత్వం అధీనంలో విద్యుత్ ప్రాజెక్టు, పంపిణీ ఉండాలనే లక్ష్యంతో అప్పటి సర్కార్ ఢిల్లీ ఎలక్ట్రిసిటీ బోర్డుకు చెందిన బదర్‌పూర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని టేకోవర్ చేసింది. 1975 నవంబర్ 7న ఎన్టీపీసీ రిజిష్టర్ ఆఫ్ కంపెనీస్‌గా నమోదు చేసి జాతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎన్టీపీసీ)గా నామకరణం చేసింది.

ప్రగతి పథంలో..

దేశంలో బొగ్గు గనులు, గ్యాస్, నీరు, స్థలం తదితర వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తిస్తూ, కొత్త ప్రాజెక్టులు స్థాపిస్తూ ముందుకు సాగుతోంది ఎన్టీపీసీ. ప్రస్తుతం దేశంలో అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా ఎదిగింది. ప్రపంచ స్థాయి విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో పోటీ పడుతోంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పవర్ ప్లాంట్ సామర్థ్యం, పీఎల్‌ఎఫ్, మెయింటనెన్స్, విధానాలు, రక్షణ, పొదుపు, పర్యావరణ సమతుల్యం, మేనేజ్‌మెంట్ విధానాలతో అగ్రస్థానంలో నిలిచింది. విద్యుత్ ఉత్పత్తిలో అగ్రభాగాన నిలుస్తూ నవరత్న కంపెనీగా ఉన్న ఎన్టీపీసీ 2010లో మహారత్న కంపెనీగా రూపాంతరం చెందింది.

విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల స్థాపన..

ఎన్టీపీసీ సొంతంగా బొగ్గు, గ్యాస్, హైడ్రో, సోలార్, ఫ్లోటింగ్ సోలార్, జాయింట్ వెంచర్స్‌తోపాటు 90 విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను కలిగి ఉంది. 73,874 మెగావాట్లు ఉత్పత్తి చేస్తూ విద్యుత్ రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ప్రస్తుతం సూపర్ క్రిటికల్ మెగా ప్రాజెక్టులు నెలకొల్పుతోంది. ఎన్టీపీసీ తన ప్రధాన వ్యాపారాన్ని బలోపేతం చేయడానికి, కన్సల్టెన్సీ, పవర్ ట్రేడింగ్, విద్యుత్ నిపుణుల శిక్షణ, బొగ్గు తవ్వకాల్లో వైవిధ్య భరితంగా ముందుకుసాగుతోంది. ప్రపంచంలోనే ప్రముఖ విద్యుత్ సంస్థగా అవతరించాలని ప్రయాణం సాగిస్తోంది.

వివిధ రంగాల్లో ఎన్టీపీసీ..

ఒకప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేసిన ఎన్టీపీసీ.. భవిష్యత్‌లో ఉత్పత్తి, పంపిణీ, కొనుగోలు, అమ్మకాలు, సొంతంగా బొగ్గు గనుల తవ్వకం తదితర రంగాల్లో ఇతర సంస్థలతో కలిసి వ్యాపారాలు చేస్తోంది. జాయింట్ వెంచర్లతో బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంక దేశాల్లో విద్యుత్ ప్రాజెక్టులు స్థాపిస్తోంది. అణు విద్యుత్ రంగంలోకి అడుగుపెట్టే తొలిఅవకాశం ఎన్టీపీసీకే దక్కుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపిక


విజేతలకు బహుమతులు అందిస్తున్న అధికారులు

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో సౌత్‌జోన్ కబడ్డీ ఎంపిక పోటీలు ప్రారంభమైనాయి. సోమవారం పోటీలను యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ మల్లేశ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం పరిధి లోని అన్ని డిగ్రీ, పీజీ కాలేజీల నుంచి సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9 నుంచి 12 వరకు కాకినాడలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నా రు. క్రీడాకారులకు యూనివర్సిటీ తరుపున టీషర్ట్, షూ అందించి, టీఏ, డీఏ చెల్లించడం జరుగుతుందని వివరించారు. విశ్వవిద్యాలయంలో 2022–23 సంవత్సరానికి గాను ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ సమర్థవంతంగా నిర్వహించిన పీడీలు ప్రభాకర్‌రావు, శ్రీధర్‌రావు, నాగేశ్వర్‌రావు, విజయ్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ అధి కారి నజీముద్దీన్, వివిధ కళాశాల పీడీలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధన.. ట్రాఫిక్ తిప్పలు

జగిత్యాలజోన్: ఎన్నికల నిబంధనలను అధికారులు పాటిస్తుంటే.. ఆ నిబంధనలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగిత్యాల నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో చేపడుతున్నారు. ఆర్డీవో కార్యాలయం నుంచి 100 మీటర్ల వరకు స్థలాన్ని పోలీసులు తమ అదుపులోకి తీసుకొని ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు రోడ్డును మూసేస్తున్నారు. ఆర్డీవో కార్యాలయం జగిత్యాల నడిబొడ్డున ఉండడం, ఆ రోడ్డే ప్రధాన రోడ్డు కావడం, జగిత్యాల పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ రోడ్డు కావడం, రోడ్డు చిన్నగా ఉండడం, పెద్దపల్లి, ధర్మపురి, మంచిర్యాల వెళ్లే బస్సులు ఆ రోడ్డు నుంచే వెళ్తుండడంతో పాటు స్థానికంగా ఉన్న ఆటోలు, జీపులు, కార్లు, మోటార్ సైకిళ్లతో రోడ్డంతా గందరగోళంగా మారుతోంది. ట్రాఫిక్ సమస్య పరిష్కరించే పోలీసులు కూడా లేక వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోతున్నాయి.


ఒకవైపు నుంచే వెళ్తుండడంతో నిలిచిపోయిన వాహనాలు



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావ్‌పాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా





న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంటో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజిమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్మదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజిమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజిమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్మదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజిమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజిమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజిమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1. **బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్మదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజిమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికీ అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా × అఫ్గానిస్తాన్

వేదిక: ముంబై

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా



రవితేజ

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.



అనుష్క

అనుష్క @ 50

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.



కమల్ హాసన్

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.



ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ - ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ- ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.



బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ- ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.



గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ- ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం



సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగ్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

- దర్శకుడు మారేష్ శివన్

''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ-''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.

